

భారీ అగ్ని ప్రమాదం

షార్ట్‌సర్క్యూట్‌తో కేసముద్రం మండలంలోని మహదేవ ఇండస్ట్రీస్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో రూ.2 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.

- 8లో ▸



నకిలీ గురుస్వామికి దేహశుద్ధి

ఓ మహిళ ఆరోగ్యం బాగు చేస్తానని నమ్మించి రూ.4లక్షలు వసూల్ చేసిన నకిలీ గురుస్వామికి మహిళలు దేహశుద్ధి చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

42.5^0 / 30.7^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మరిపెడ బ్రాంచ్ పోస్టాఫీస్ తనిఖీ



మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాంచ్ పోస్టాఫీస్‌ను జిల్లా తనిఖీ అధికారి సైదానాయక్ తనిఖీ చేశారు. బ్రాంచ్‌పోస్ట్ మాస్టర్ పది రోజులుగా ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజర్ కావడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోస్టాఫీసు తాళం గ్రామస్తుల సమక్షంలో పగులగొట్టి తనిఖీ చేశారు. స్థానికులు అక్కడికి చేరుకోని అధికారులకు తమగోడు వినిపించారు. ఆర్డీలు చెల్లించేవారు, పింఛన్ పొందే వారు తమకు పింఛన్ ఇవ్వకుండా పోయాడని ఆరోపించారు. దీంతో అధికారులు మీకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని చెప్పారు. ఆయనతో పాటు అధికారులు సుధాకర్, ప్రశాంత్, సబ్‌పోస్ట్ మాస్టర్ యాకూబ్‌లు ఉన్నారు.

హెచ్‌సీఏ లీగ్ క్రికెట్‌కు ఎంపిక



బి.కుమార్



జి.సాయికుమార్

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే టుడే లీగ్ బీ డివిజన్ క్రికెట్ టోర్నమెంట్‌కు మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన బానోత్ కుమార్, ఇనుగుర్తికి చెందిన గోపందాస్ సాయి కుమార్ ఎంపికయ్యారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.అజయ్ శనివారం తెలిపారు. 16 మంది సభ్యులు గల వరంగల్ ఉమ్మడి జిల్లా జట్టు డబ్ల్యూసీఏకు కెప్టెన్‌గా మానుకోట జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికవడం హర్షణీయమన్నారు. ఈ ఎంపిక సహకరించిన డబ్ల్యూసీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మర్ క్రికెట్ క్యాంప్ పరిశీలన



మహబూబాబాద్ అర్బన్: గత నెల 5 నుంచి మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ క్యాంప్‌ను జిల్లా క్రీడల శాఖ అధికారి అనిల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ క్రీడలకు పుట్టినిల్లు లాంటిది మానుకోట అని, ఇక్కడ నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారులు ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రికెట్ క్రీడాకారులు బి.విజయ సారథిరెడ్డి, రంజిత్‌రెడ్డి, కుమారస్వామి, క్రికెట్ కోచ్ పెరుగు కుమార్, క్రీడాకారులు అనిర్వేష్, గౌతమ్, ముజాహిద్, సాద్విత్, భరత్‌రెడ్డి, ధర్మ చరణ్ రెడ్డి, బన్ను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనుచరుడినని ఇబ్బంది పెడుతున్నాడు

- రెడ్యానాయక్ ఎదుట సర్పంచ్ తనయుడి నిరసన



మరిపెడ రూరల్: మంత్రి సత్యవతిరాథోడ్ అనుచరుడినని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తనను చాలా రోజులుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఈ క్రమంలోనే తాను ప్రొసీడింగ్ తెచ్చుకున్న రూ.40 లక్షల అభివృద్ధి పనులను హోల్డ్‌లో పెట్టించాడని మూలమర్రితండా సర్పంచ్ తేజావత్ జగిని తనయుడు బీఆర్‌ఎస్ నాయకుడు భరత్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు మూలమర్రితండా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేను అడ్డుకుని ప్రశ్నించాడు. మంత్రి, ఎమ్మెల్యే ఇద్దరు కూడా బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులేనని అయినప్పటికీ ఎమ్మెల్యే వర్గాలను పోషిస్తూ తనను అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. మా అమ్మ తేజావత్ జగిని మూలమర్రితండా సర్పంచ్ అయినా కూడా ప్రోటోకాల్ పాటించడం లేదని భరత్‌కుమార్ ఆరోపించారు.

సర్వం సిద్ధం

- గ్రూప్-1కు జిల్లా వ్యాప్తంగా 13 సెంటర్లు
- హాజరు కానున్న 4,046 మంది అభ్యర్థులు
- ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష
- సెంటర్ ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు



తక్షశిల పరీక్ష కేంద్రంలో నంబరింగ్ పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, మహబూబాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేడు (ఆదివారం) నిర్వహించే గ్రూప్-1 పరీక్షకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. గతంలో జరిగిన అవకతవకలు, అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈసారి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పరీక్ష కోసం కలెక్టర్ శశాంక పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, మున్సిపాలిటీ అధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు. పరీక్ష రోజు అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వాహనకు చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లను నియమించారు. ఇందులో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను నియమించారు. వారికి పరీక్ష నిర్వాహన, విధి విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతో శనివారం అధికారులు వారికి కేటాయించిన సెంటర్లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

జిల్లాలో 13 సెంటర్లు

ఏ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఆ జిల్లాలో పరీక్ష రాసే విధంగా ఈ సారి జిల్లాలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పరీక్ష కేంద్రాలకు కావాల్సిన వనరులు ఉన్న భవనాలు, రవాణా సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకున్నారు. దీనికి అనుగుణంగా మహబూబాబాద్ పట్టణంలో ఎనిమిది సెంటర్లు, మరిపెడ 2, తొర్రూరు మున్సిపాలిటీలో మూడు కేంద్రాలు కాగా మొత్తం 13 సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుంది. అయితే పరీక్ష కేంద్రానికి ఉదయం 10:15 గంటలలోపే అనుమతి ఇస్తారు.

పరీక్ష కేంద్రాలు–రూట్ మ్యాప్

- **టీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్ సెంటర్ మహబూబాబాద్:** ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కేసముద్రం వెళ్లే దారిలో ఉంటుంది. రైల్వేస్టేషన్ నుంచి కాలినడకన వెళ్లొచ్చు. ఆటోలు కూడా ఉంటాయి.
- **తెలంగాణ మోడల్ స్కూల్ మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణానికి కిలో మీటరు దూరంలో అనంతారం దేవాలయానికి వెళ్లే దారిలో ఉంటుంది. బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి ఆటోలు ఉంటాయి.
- **ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కేసముద్రం వెళ్లే దారిలో ఉంటుంది. బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి కాలి నడకన వెళ్లొచ్చు.
- **ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సెంటర్, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణంలోని చేపల మార్కెట్ దగ్గరలో ఉంటుంది. బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి కాలి నడకన వెళ్లొచ్చు.
- **మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల సెంటర్ మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణంలోని నెహ్రూ సెంటర్ నుంచి వెళ్లే పత్తిపాక, రజాల్ పేట రోడ్డులో ఉంటుంది. బస్టాండ్ నుంచి 2 కిలో మీటర్లు, రైల్వే స్టేషన్ నుంచి ఒక కిలోమీటర్ దూరంలో ఉంటుంది.
- **మహర్షి విద్యాలయం సెంటర్:** మహబూబాబాద్ బస్టాండ్ నుంచి కేసముద్రం వెళ్లే దారిలో ఉంటుంది. ఆటో ద్వారా వెళ్లవచ్చు. కేసముద్రం వెళ్లే బస్సు ఎక్కినా సెంటర్ వద్ద దిగవచ్చు.
- **తక్షశిల హైస్కూల్ సెంటర్:** ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని వెంకట్రామ టాకీస్ సమీపంలో ఉంటుంది. బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి కాలినడకన వెళ్లొచ్చు.
- **హోలీ ఏంజిల్స్ హైస్కూల్ సెంటర్:** మహబూబాబాద్ పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ సమీపంలో ఉంటుంది. ముకుందా టాకీస్ వెనక వైపు ఉంటుంది. బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో వెళ్లవచ్చు.
- **టీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్ బాలుర జూనియర్ కళాశాల, మరిపెడ సెంటర్:** మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో ఉంటుంది. ఖమ్మం- వరంగల్ హైవే మీద ఆర్లగడ్డ తండా సమీపంలో ఉంటుంది. మరిపెడ బస్టాండ్ నుంచి ఆటోలు ఉంటాయి.
- **టీటీ డబ్ల్యూయూఆర్ జూనియర్ కళాశాల మరిపెడ:** మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో ఉంటుంది. ఖమ్మం- వరంగల్ హైవే మీద ఆర్లగడ్డ తండా సమీపంలో ఉంటుంది. మరిపెడ బస్టాండ్ నుంచి ఆటోలు ఉంటాయి.
- **టీఎస్‌డబ్ల్యూ ఆర్‌జేసీ తొర్రూరు సెంటర్:** తొర్రూరు మున్సిపాలిటీలో ఉంటుంది. కోర్టు రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో దుబ్బతండాలో ఉంటుంది.
- **సెయింట్ పాల్స్ హైస్కూల్ వెలికట్టె సెంటర్:** తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో ఉంటుంది. పాలకేంద్రం దగ్గరలో ఈ సెంటర్ ఉంటుంది. బస్టాండ్ నుంచి ఆటోలు వెళ్తాయి.
- **సమత డిగ్రీ కళాశాల తొర్రూరు:** తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉంటుంది.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కంఠాయపాలెం, పెద్ద మంగ్యా తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం వస్తే కరెంట్ లేక, సాగునీరు లేక తెలంగాణ ఏడారిగా మారుతుందని చెప్పిన నాయకులు ఇప్పుడు మాట్లాడాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి చేస్తుందన్నారు. ఇలాంటి సీఎం కేసీఆర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజయ్య, జెడ్పీఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్, సర్పంచ్‌లు శ్రీపాల్‌రెడ్డి, సరస్వతి, ఎంపీటీసీలు పల్లె దేవమ్మ, బత్తుల మల్లమ్మ, ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఎంపీడీఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో జీవించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్: సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కోర్టు భవనాల సముదాయం ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. నాలుగు బెంచీలు ఏర్పాటు చేయగా జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి సి.సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి యూ.తిరుపతి వివిధ కేసుల్లో కక్షిదారులను పిలిపించి ముఖాముఖి మాట్లాడి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నాలుగు కోర్టుల పరిధిలో 253 కేసులు పరిష్కారం కాగా ఇందులో 9 మోటారు వాహన ప్రమాదాల కేసులకు సంబంధించి బాధితులకు రూ. 22.30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వెంకట్‌స్వామి, లోక్ అదాలత్ కమిటీ సభ్యులు జ్యోతిబాబు, వల్లపు యాదగిరి, మామిడాల సత్యనారాయణ, కాలేరు శ్రీనివాస్, ప్రభుత్వ ప్లీడర్లు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బేతోలు గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రజాలిపేట గ్రామానికి చెందిన అరిగెల లక్ష్మీనరసమ్మ (45) మహబూబాబాద్ పట్టణం నుంచి ఆటోలో ఇంటికి బయలుదేరింది. బేతోలు పత్తి మిల్లు సమీపంలో ఆటో దిగి రజాలీపేట వెళ్లడం కోసం రోడ్డు దాటుతుండగా కురవి వైపు నుంచి గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జరిగిన సంఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు కురవి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు.

అభివృద్ధిలో డోర్నకల్ ఫస్ట్

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



ధారావత్‌తండాలో ఎమ్మెల్యేను నిలదీస్తున్న గిరిజన ప్రజలు

మరిపెడ రూరల్: అభివృద్ధిలో డోర్నకల్ నియోజకవర్గం ముందు వరుసలో ఉంటుందని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మరిపెడ మండలం తానంచర్ల, మూలమర్రితండా, వాల్యతండా, కోట్యతండా, అజ్మీరతండా గ్రామ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, పాఠశాల భవనం, కల్వర్టులు, ఆకేరువాగు లోలెవల్ బ్రిడ్జి తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు అజ్మీరాతండాలో నూతనంగా నిర్మించిన 10 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌తో రాష్ట్ర అభివృద్ధి చెందిందన్నారు. మరోసారి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర, ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు చాపల యాదగిరిరెడ్డి, రామడుగు అచ్చుత్‌రావు, ఓడీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఏఓ వీరసింగ్, రావుల వెంకట్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ రమేష్, సర్పంచులు పాల్గొన్నారు.

ధారావత్ తండాలో అడ్డగింత

మండలంలోని మూలమర్రితండా గ్రామ పంచాయతీ పరిధిలోని ధారావత్‌తండాలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన వెనుదిరిగి వస్తున్న క్రమంలో అక్కడి గిరిజనులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ఓట్లప్పుడు మాత్రమే వచ్చి మళ్లీ ఓట్లు వస్తున్నాయని తండాకు వచ్చాడని నిలదీశారు. తండాకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదని ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. కొంత సమయం పాటు ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. వెంటను ఎమ్మెల్యే కలుగజేసుకొని మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే తాగు నీటి బావికి విద్యుత్ స్తంభాలకు ఎమ్మెల్యే కోటా నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తానని హామీ ఇవ్వడంతో తండా వాసులు శాంతించారు.

జిల్లా అభివృద్ధికి పాటు పడాలి

- జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్
- ఘనంగా సుపరిపాలన దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్జి చంద్రశేఖర ప్రసాద్, కలెక్టర్ శశాంక, ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్: అధికారులు విధులు సక్రమంగా నిర్వహించి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సుపరిపాలన దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జడ్జి చంద్రశేఖరప్రసాద్, కలెక్టర్ కె.శశాంక, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ఎం.డేవిడ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమానికి జడ్జి చంద్రశేఖరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వెనుకబడిన జిల్లా అయినందున జిల్లాను మరింత అభివృద్ధి చెందేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పథకాల అమలు విషయంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లీగల్ సెల్ అథారిటీ ద్వారా ప్రజలతో మమేకం అయ్యే అవకాశం కలిగిందన్నారు. కలెక్టర్ కె. శశాంక మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తాను అంకిత భావంతో పని చేస్తూ ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలందించాలన్నారు. ఉద్యోగంలో చేరినప్పుడే ఒక లక్ష్యంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల వద్దకు ప్రజలు వచ్చినప్పుడు ఎంత ఒత్తిడి ఉన్న ఓపికగా సమాధానం చెప్పడం నేర్చుకోవాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ పోరాట ఫలితంగా రాష్ట్రంను సాధించుకుని అభివృద్ధి విషయంలోనే దేశంలోనే నంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ఎం డేవిడ్, మున్సిపల్ చైర్మన్‌లు డాక్టర్‌పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రైతు ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 శాతం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలని కోరుతూ ఈ నెల 12, 13 తేదీల్లో మండల, డివిజన్ కేంద్రాల్లో ధర్నాలు జరపాలని పిలుపునిచ్చామన్నారు. ఎన్నికల సమయంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కేసీఆర్ ప్రభుత్వం నేటికి అమలు చేయకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు మోకాళ్ళ మురళీకృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శివ్వారపు శ్రీధర్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పద్మ, నర్సమ్మ, పీవైఎల్ జిల్లా కార్యదర్శి భట్టు చైతన్య, బ్రహ్మచారి, ప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాలు సీజ్!

కొత్తగూడ: మండలంలోని వేలుబెల్లి గ్రామంలో ఓ వ్యాపారి మొక్కజొన్న విత్తనాలను భారీగా డంప్ చేసినట్లు తెలిసింది. కొత్తగూడ, గంగారం మండలాల పరిధిలో సుమారు 25వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుంది. ఇక్కడి భూములకు, వాతావరణానికి అనుకూలంగా సింజెంట కంపెనీకి చెందిన ఎన్‌కె 30 రకం విత్తనాలు ఎక్కువ మొత్తంలో రైతులు సాగు చేస్తారు. దీనిని అదనుగా చేసుకున్న వ్యాపారులు ఆ విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించడం లేదా నకిలీ విత్తనాలను విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో సీజన్‌కు ముందే ఓ వ్యాపారీ లారీ లోడు విత్తనాలను ఒకే చోట డంప్ చేయగా 2రోజుల క్రితం ఏఓ సీజ్ చేసినట్లు సమాచారం. అయితే ఆ వ్యాపారితో ఏఓ బేరం ఆడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై మండల వ్యవసాయాధికారిని వివరణ కోరగా మొక్కజొన్న విత్తనా లకు సంబంధించిన బిల్లులు లేకపోవడంతో డంప్ చేసిన గోదాంకు తాళం వేసి తన ఆధీనంలోకి తీసుకున్న విషయం నిజమేనన్నారు. వ్యాపారి బిల్లులు ఇస్తామని హామీ మేరకు వేచి చూస్తున్నట్లు తెలిపారు. బేరం ఆడినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమన్నారు.

జింకల సందడి



గంగారంలో సందడి చేస్తున్న జింకలు

గంగారం: గంగారం మండలంలోని గ్రామ సమీపంలో ఉదయం కురిసిన తొలకరి జల్లులకు అటవీ ప్రాంతంలోని జింకలు సమీపంలోని గ్రామాల్లోకి వచ్చి సందడి చేశాయి. అటవీ ప్రాంతం నుంచి గ్రామ శివారులోకి వచ్చి జింకలు సందడి చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మైదాన ప్రాంతాల్లోని గ్రామ సమీపంలోకి వచ్చిన వన్యప్రాణులకు ఎలాంటి హాని కల్పించకూడదని, ఎవరైనా వాటికిహాని కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

లేగదూడల పంపిణీ



నర్సింహులపేట: మండలంలోని వంతడపల గ్రామంలో శివ పార్వతి గోశాల ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ 10 లేగ దూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు పశువుల మేత లేకపోయిన గోశాల సంస్థ ఆధ్వర్యంలో పశుగ్రాసంను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పశువులు నీళ్ల తాగడానికి నీటి తొట్టీలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లకు సూచించారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని ఉద్యోగ భద్రత, గ్రాట్యూటీ, అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి గుగులోత్ సరోజ అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టే అంగన్‌వాడీ జీపు జాత గోడ పత్రికలను శనివారం సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన ఆదిలాబాద్ నుంచి ప్రారంభమయ్యే జీపుజాతను విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 27న జీపుజాత మహబూబాబాద్ పట్టణానికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు మంగ, స్నేహబిందు, నాయకులు సుజాత, హలీమ, భాగ్య, అనురాధ, రజిని, ఉపేంద్ర, కుమ్మరికుంట్ల నాగన్న తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



దంతాలపల్లి : విరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు, ధ్వంసమైన కారు

తొర్రూరు రూరల్/దంతాలపల్లి/ పెద్దవంగర: జిల్లాలోని పలు మండలాల్లోల శనివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా గాలి రావడంతో రోడ్డుపై భారీ చెట్లు కూలిపోయాయి. దీంతో ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. తొర్రూరు మండలంలోని చెర్లపాలెం, అరిపిరాల, వెంకటాపురం, చీకటాయపాలెం, ఫత్తేపురం, పోలెపల్లి, దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారం, పెద్దవంగర మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లోని భారీ చెట్టు నేలకూలింది. అమర్ సింగ్ తండాలో ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు 7 విద్యుత్ స్తంభాలు, గంట్లకుంట గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్, పెద్దవంగరలో 3 మూడు, చిట్యాల 2, బొమ్మకల్లులో 4 విద్యుత్ స్తంభాలు ధ్వంసం అయినట్లు విద్యుత్‌శాఖ ఏఈ రమేష్ తెలిపారు. 2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ రమేష్ బాబు ప్రకటించారు.

భూ వివాదం.. రైతు ఆత్మహత్యాయత్నం




చికిత్స పొందుతున్న అంజయ్య

రఘునాథపల్లి : భూ వివాదం.. ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి కారణమైంది. ఈ ఘటన మండలంలోని జాఫర్‌గూడెంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పులిగిల్ల అంజయ్యకు ఖిలాషాపూర్‌ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్‌ 1424లో 6 ఎకరాల భూమి ఉంది. 25 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ భూమి సమీపంలో ఉన్న రైస్‌ మిల్లు యజమాని పెండ్లి మల్లారెడ్డి, తన కుమారుడు దిలీప్‌రెడ్డి సర్వే నంబర్‌ 1420లో 2 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. వారు కొనుగోలు చేసిన భూమి సర్వే నంబర్‌ అంజయ్య ఆధీనంలో ఉన్న భూమిలో చూపిస్తోంది. దీంతో ఈ భూమిని తాము కొనుగోలు చేసినట్లు కొన్నాళ్ల నుంచి తండ్రీ కొడుకులు..అంజయ్యను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీనిపై అంజయ్య రెండుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పట్టించుకోలేదు. ఈ క్రమంలో శనివారం తన కుమారుడు మధుతో కలిసి ఆ భూమిలో పెసరకు నీరు పారించేందుకు వెళ్లారు. వీరిని గుర్తించిన మల్లారెడ్డి, దిలీప్‌రెడ్డి రైస్‌ మిల్లులో పనిచేసే కూలీలతో వెళ్లి బెదిరించారు. ఓ దశలో దాడికి యత్నించడంతో మనస్తాపానికి గురైన అంజయ్య పురుగుల మందు తాగాడు. దీంతో కుమారుడు మధు, భార్య పద్మ గుర్తించి వెంటనే అంజయ్యను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రఘుపతి.. అంజయ్య వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. మల్లారెడ్డి, దిలీప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మాయదారి మహమ్మారి..

మరణశయ్యపై యువతి శైలు..
- దీర్ఘకాలిక వ్యాధితో ఆస్పత్రి పాలు
- నెలనెలా మందులకే రూ. 25వేలు
- ప్రభుత్వ సాయం కోసం వేడుకోలు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు



టేకుమట్ల (రేగొండ) : ఓ చేతిలో పెన్ను.. మరో చేతిలో పుస్తకం.. ఉదయం తరగతి గదిలో.. సాయంత్రం ఇంట్లో (హోమ్‌ వర్క్‌) చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాల్సిన ఓ విద్యార్థిని మాయదారి మహమ్మారితో మంచానికే పరిమితమైంది. 5వ తరగతి వరకు హాయిగా ఆడుతూపాడుతూ చదువుకున్న ఆ విద్యార్థిని 6వ తరగతిలో అనారోగ్యానికి గురైంది. అప్పటి నుంచి ఆస్పత్రికే అంకితమైంది. రోజూ ఆహారానికి బదులు మాత్రలు, నీటికి బదులు గ్లూకోజ్‌ తీసుకుంటూ ప్రాణాలతో పోరాడుతోంది. లక్షల్లో ఒక్కరికి అరుదుగా సోకే వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం మరణశయ్యపై కొట్టిమిట్టాడుతోంది. కాగా, నెలనెలా మందులకే వేలాది రూపాయల ఖర్చు అవుతోంది. దీంతో రెక్కడితేకాని డొక్కాడని ఆ కుటుంబం ప్రభుత్వ సాయం కోసం ప్రాధేయపడుతోంది. అలాగే, మానవత్వంతో చేయూతనందించే దాతల ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నది.

ఆరో తరగతిలోనే అనారోగ్యం..

జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చిన్నకోడెపాకకు చెందిన తంగేళ్ల విజయ, రవి దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రెండో కుమార్తె తంగేళ్ల శైలు 6వ తరగతిలోనే అనారోగ్యానికి గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు తమ కూతురును వరంగల్‌, హైదరాబాద్‌ లోని పలువురు వైద్యులకు చూపించగా వారు శైలుకు ఎస్‌ఎల్‌ఈ (సిస్టమిక్‌ ల్యూపస్‌ ఎరిథెమాటసస్‌) అనే వ్యాధి వచ్చినట్లు నిర్ధారించారు. ఒక వైపు వ్యాధి బారిన పడినప్పటికీ.. మరోవైపు శైలు చదువు కొనసాగించారు. 2017లో పదో తరగతిలో 7.9 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం ఇంటర్‌ బైపీసీలో చేరారు. అయితే 2020 మార్చిలో నడవలేని స్థితిలో వార్షిక పరీక్షలు రాయలేక పోయారు. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న శైలు

నిత్యం వైద్యుల పర్యవేక్షణలోనే..

దీర్ఘకాలిక వ్యాధి బారిన పడిన శైలు నిరంతరం వైద్యుల పర్యవేక్షణలోనే ట్రీట్‌మెంట్‌ పొందుతున్నారు. నిమ్స్‌, ఎంజీఎంతోపాటు పలు ప్రైవేట్‌ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కాగా, శైలుకు చికిత్స అందిస్తున్న డాక్టర్లు మరోవైపు ఆ వ్యాధిపై పరిశోధనలు చేస్తున్నారు.

మందులకే నెలకు రూ. 25వేల ఖర్చు..

తంగేళ్ల శైలుకు సోకిన దీర్ఘకాలిక వ్యాధిని అదుపులో ఉంచడానికి నెలకు కేవలం మందులకే రూ. 20 నుంచి రూ. 25 వేల వరకు ఖర్చు అవుతోంది. రోజుకు ఐదు రకాల మందులను క్రమం తప్పకుండా వేయించాలి. ఏ ఒక్కటి తగ్గినా ప్రాణానికే ప్రమాదమని వైద్యులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ సాయం కోసం వేడుకోలు..

తమ కూతురు బంగారు భవిష్యత్‌ ఇలా అనారోగ్యం బారినపడడంతో తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతున్నారు. అంతేకాకుండా ఆర్థికంగా అష్టకష్టాలు పడుతూ వైద్యం చేయించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు.అలాగే, దాతల ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

దాతలు ఇలా విరాళాలు అందించొచ్చు..

తమ కూతురు తంగేళ్ల శైలు ప్రాణం కాపాడానికి దాతలు ముందుకు రావాలని తల్లిదండ్రులు చేతులెత్తి వేడుకుంటున్నారు.

9676165929 ఈ నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అలాగే, యూనియన్‌ బ్యాంక్‌ అకౌంట్‌ నంబర్‌ : **138510100121498,**

ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌ : యుబీఐఎన్‌0813851లో ఆపన్నహస్తం అందించాలని కోరుతున్నారు.

వైద్యసేవలు, విజయాలను వివరించాలి

- 14న వైద్య, ఆరోగ్య దినోత్సవం
- డీఎంఈ డాక్టర్‌ రమేష్‌రెడ్డి

ఎంజీఎం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న నిర్వహించనున్న వైద్యారోగ్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డైరెక్టర్‌ ఆఫ్‌ మెడికల్‌ ఎడ్యుకేషన్‌(డీఎంఈ) డాక్టర్‌ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రిలో ఉమ్మడి వరంగల్‌ జిల్లా వైద్యాధికారులు, అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలు, సాధించిన విజయాలను హెల్త్‌ డే రోజు వివరించాలన్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు పెడుతున్న భోజనాన్ని రుచి చూశారు. భోజనం బాగుందని కితాబిచ్చారు. అయితే పండ్లు ఎందుకు పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కేఎంసీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మోహన్‌దాస్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రామ్‌కుమార్‌ రెడ్డి, హనుమకొండ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, ఆర్‌ఎంఓలు మల్లికార్జున్‌, మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఈ రమేష్‌రెడ్డి

స్వరాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం..



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- సీఎం కేసీఆర్‌ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలకు మహర్దశ
- రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి: స్వరాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని, తెలంగాణలో గ్రామ స్వరాజ్యం ఆవిర్భవించిందని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మహబూబ్‌నగర్‌లో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, వైకుంఠ ధామాలను అదనపు కలెక్టర్‌ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 60 ఏళ్ల ఉమ్మడి పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనకబడిందన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్‌ వివిధ పథకాలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు, సీసీరోడ్లు, మురుగు నీటి కాల్వలు, మెటల్‌రోడ్లు, మిషన్‌ భగీరథ నల్లాలకు సంబంధించిన పనులు వేగవంతమైనట్లు తెలిపారు. అభివృద్ధిని పక్కనబెట్టి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు వచ్చే కాంగ్రెస్‌, బీజేపీ నాయకులను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ గాదె హేమలతారవీందర్‌రెడ్డి, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ చిక్కొండ రజిత, ఉపసర్పంచ్‌ సురేష్‌, తహసీల్దార్‌ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు నర్సింహానాయక్‌, బిల్లా సుధీర్‌రెడ్డి, పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా లింగనిర్ధారణ యంత్రాల విక్రయం



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ



స్వాధీనం చేసుకున్న స్కానింగ్‌ యంత్రాలు

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు
- రూ. 25 లక్షల విలువైన యంత్రాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ ఏవీ రంగనాథ్‌

వరంగల్‌ క్రైం: వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో అనుమతులు లేకుండా, అర్హత లేని వ్యక్తులకు లింగనిర్ధారణ చేసే స్కానింగ్‌ యంత్రాలను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను కేయూసీ, దామెర పోలీసులు సంయుక్తంగా అరెస్ట్‌ చేశారు. వీరి నుంచి రూ. 25 లక్షల విలువైన 6 పోర్టబుల్‌, 12 ఫిక్స్‌డ్‌ స్కానింగ్‌ యంత్రాలను స్వాధీనం చేసుకున్నామని వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌ తెలిపారు. శనివారం సాయంత్రం కమిషనరేట్‌లో నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు.

సులభంగా డబ్బు సంపాదించడమే ధ్యేయంగా..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన మల్లిపుడి అశోక్‌ కుమార్‌, నెల్లూరుకు చెందిన తాతపూడి కిరణ్‌ కుమార్‌ సులభంగా డబ్బు సంపాదించడానికి ఈ మార్గం ఎంచుకున్నారు. గత నెలలో అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడుతూ అరెస్టు అయిన ప్రధాన నిందితుడు వేముల ప్రవీణ్‌ సమాచారం మేరకు.. మల్లిపుడి అశోక్‌ కుమార్‌ విజయవాడలో 2012 సంవత్సరం నుంచి ఎమిలిటీ కన్సల్టెన్సీ సర్వీస్‌ ఇంజినీర్‌ ఈసీజీ, అల్ట్రా సౌండ్‌ స్కానింగ్‌ యంత్రాలను మరమ్మతులు చేసేవాడు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లోని హాస్పిటల్స్‌కు చెందిన స్కానర్లు మరమ్మతులు చేయడం ద్వారా సంబంధిత డాక్టర్లతో పరిచయమైంది. అనంతరం ఆ హాస్పిటల్స్‌ నుంచి పాత స్కానర్లను కొనుగోలు చేయడంతో పాటు చెన్నైలో కూడా పాత స్కానింగ్‌ యంత్రాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటికి మరమ్మతులు చేసి ఎక్కువ ధరకు, అర్హత లేని వ్యక్తులకు విక్రయించేవాడు. ఈ క్రమంలో వరంగల్‌, హనుమకొండ ప్రాంతాల్లో స్కానింగ్‌ యంత్రాల మరమ్మతు చేసే క్రమంలో వేముల ప్రవీణ్‌తో పరిచయమై ఆయనకు అక్రమంగా ఒక స్కానింగ్‌ యంత్రాన్ని విక్రయించాడు. ఈ క్రమంలో ప్రస్తుతం నిందితుడి నుంచి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న మరో 4 పోర్టబుల్‌, 11 ఫిక్స్‌డ్‌ స్కానింగ్‌ యంత్రాలను కేయూసీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మరోఘటనలో..

గత నెలలో అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడుతూ అరెస్ట్‌ అయిన డాక్టర్‌ సబిత సమాచారం మేరకు ఆమెకు అక్రమంగా స్కానింగ్‌ యంత్రాన్ని అమ్మిన మరో నిందితుడు తాతపూడి కిరణ్‌ కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. నిందితుడు కిరణ్‌ కుమార్‌ 2018లో డేవిస్‌ మెడికల్‌ ఎక్విప్‌మెంట్‌ కంపెనీ సెట్స్‌ మెన్‌గా పనిచేస్తూనే స్కానింగ్‌ యంత్రాల మరమ్మతులు చేయడం నేర్చుకున్నాడు. 2021లో కావలి ప్రాంతంలో ‘పవిత్ర టెక్నాలజీ’ పేరుతో స్కానింగ్‌ సర్వీసు సెంటర్‌ ఏర్పాటు చేసి వివిధ హాస్పిటల్స్‌ లోని స్కానింగ్‌ యంత్రాలను మరమ్మతులు చేసేవాడు. హనుమకొండకు వచ్చిపోయే క్రమంలో డాక్టర్‌ సబితతో పరిచయం ఏర్పడి ఆమెకు అనుమతులు లేకుండా రూ. లక్షకు స్కానింగ్‌ యంత్రాన్ని విక్రయించినట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతని నుంచి మరో రెండు పోర్టబుల్‌ , ఒక ఫిక్స్‌డ్‌ స్కానింగ్‌ యంత్రాన్ని దామెర పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.

అధికారులకు అభినందనలు

నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీ పుష్ప, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్‌ సుజాత, కమాండ్‌ కంట్రోల్‌ ఇన్‌స్పెక్టర్‌ వినయ కుమార్‌, ఎస్సైలు సతీష్‌, రాజేందర్‌, జానీ పాషా, షేక్‌, ఫసియూద్దీన్‌, మల్లేషం, ఏఏఓ సల్మాన్‌ పాషా, హెడ్‌ కానిస్టేబుల్‌ నర్సింగరావు, కానిస్టేబుళ్లు సంపత్‌, రాజేశ్‌, రవీందర్‌, సైబర్‌ క్రైం కానిస్టేబుల్‌ రాజు, ఏహెచ్‌టీయూ సిబ్బంది, ఏఎస్‌ఐ భాగ్యలక్ష్మీ, హెడ్‌ కానిస్టేబుల్‌ సమీయుద్దీన్‌, కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ను సీపీ అభినందించారు.

తండ్రి మందలించాడని.. క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య



అజార్‌ (ఫైల్‌)

ఖానాపురం: తండ్రి మందలించాడనే కారణంతో క్షణికావేశానికి గురైన ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం బుధరావుపేటలో జరిగింది. గ్రామానికి చెందిన షేక్‌ అజార్‌(26) నర్సంపేటలోని ఓ మైనార్టీ పాఠశాలలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికెళ్లాడు. ఆలస్యంగా ఇంటికి రావడంతో తండ్రి సర్వర్‌ మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన అజార్‌ గ్రామ శివారులోని నల్లాల బావి వద్దకు వెళ్లాడు. స్నేహితులు ఆజం, ప్రణయ్‌కు ఫోన్‌ చేసి నేను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, ఇదే నా చివరి ఫోన్‌ కాల్‌ అంటూ విషయం చెప్పాడు. ఆందోళనకు గురైన స్నేహితులు వెంటనే ద్విచక్రవాహనంపై బావి వద్దకు వెళ్తూ మరో స్నేహితుడు నాగరాజుకు సమాచారం అందించారు. మొదట ఆజం, ప్రణయ్‌ బావి వద్దకు చేరుకుంటుండగా వారిని చూసిన అజార్‌ బావిలో దూకాడు.స్నేహితుడిని రక్షించుకోవాలనే తపనతో ప్రణయ్‌ సైతం బావిలో దూకాడు. ప్రణయ్‌ చేతికి చిక్కిన అజార్‌ భయంతో గట్టిగా పట్టుకోవడంతో ప్రణయ్‌ సైతం ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాడు. బావి వద్దకు వచ్చిన మరో స్నేహితుడు నాగరాజు సహాయంతో ప్రణయ్‌ బయటకు వచ్చాడు. అజార్‌కి ఎలాంటి రక్షణ అందకపోవడంతో నీటిలో మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బావి వద్దకు చేరుకొని కుమారుడిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. సాధ్యపడకపోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని అజార్‌ మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా, ఈ ఘటనపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మానసిక ఒత్తిడితో యువతి..



రమ్య (ఫైల్‌)

రఘునాథపల్లి: మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఓ యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని నిడిగొండలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తూడి బాలయ్య -ప్రమీల దంపతులకు ఇద్దరు కూతుళ్లు రేణుక, రమ్య (26), కుమారుడు రమేష్‌ ఉన్నారు. వివాహం అయిన పెద్ద కూతురు రేణుక గొడవల కారణంగా విడాకులై తల్లిగారింటి వద్దే ఉంది. అక్క ఇంటి వద్దనే ఉండడం , తనకు పెళ్లి కావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన రమ్య శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరివేసుకొంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రఘుపతి సంఘటనా స్థలానికి చేరుకొని బలవన్మారణానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

మానసిక పరిస్థితి బాగోలేక వివాహిత..



సౌమ్య (ఫైల్‌)

దేవరుప్పుల: మానసిక పరిస్థితి బాగోలేక జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం కోలుకొండలో చోటుచేసుకుంది. ఎస్సై మునావత్‌ రమేష్‌నాయక్‌ కథనం మేరకు.. కోలుకొండకు చెందిన గుండెకారి అనిత, శ్రీనివాస్‌ కూతురు సౌమ్య(28)ను ఆరేళ్ల కిందట ఇదే మండలంలోని రామచంద్రాపురానికి చెందిన మేనల్లుడు దుదాటి సతీష్‌కు ఇచ్చి వివాహం చేశారు. జీవనోపాధి కోసం కోలుకొండలో స్థిరపడిన వీరికి కూతురు జన్మించింది. ఇటీవల సౌమ్య ఆరోగ్య పరిస్థితి బాగాలేక మానసికంగా ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో శనివారం సౌమ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. తండ్రి గుండెకారి శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సౌమ్య మృతదేహాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

మహాదేవ ఇండస్ట్రీస్‌లో భారీ అగ్ని ప్రమాదం

కాలిపోయిన ధాన్యం, బియ్యం బస్తాలు
- రూ.2 కోట్ల మేర ఆస్తి నష్టం
- షార్ట్‌ సర్క్యూట్‌తోనే మంటలు
- సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌



మంటలను ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

కేసముద్రం : షార్ట్‌ సర్క్యూట్‌తో ఓ రైస్‌మిల్లులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.2 కోట్ల విలువైన ధాన్యం, బియ్యం బస్తాలు, గన్నీ సంచులు, మిషన్‌ పరికరాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం భుక్యారాంతండా జీపీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు, అధికారులు కథనం ప్రకారం.. కేసముద్రం విలేజ్‌ సమీపంలోని మహాదేవ ఇండస్ట్రీస్‌ రైస్‌మిల్లులో ఎప్పటిలాగే పనులు ముగించుకుని శుక్రవారం సాయంత్రం సిబ్బంది ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున మిల్లు వద్దకు బస్తాలను లోడ్‌ చేసేందుకు హమాలీలు వచ్చారు. ఈ క్రమంలో మిల్లు నుంచి పొగలు రావడాన్ని వారు గమనించి యాజమాన్యానికి సమాచారం అందించారు. ఈ క్రమంలో బస్తాలకు అంటుకున్న మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. మిల్లు యజమాని అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా పూర్తిస్థాయిలో చల్లారలేదు. దీంతో మిల్లు గోడను జేసీబీ సాయంతో కూలగొట్టి ఫైర్‌ సిబ్బంది మధ్యాహ్నం వరకు మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే 5 వేల క్వింటాళ్ల ధాన్యం బస్తాలు, 1,500 క్వింటాళ్ల బియ్యం, 10 వేల గన్నీసంచులు, మిల్లు పరికరాలు దగ్ధమైనట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తం రూ.2 కోట్ల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌, జేసీ డేవిడ్‌, పౌరసరఫరాల శాఖ డీఎం కృష్ణవేణి, డీటీ నారాయణరెడ్డి, సీఐ రమేష్‌, ఎస్సై తిరుపతి, తహసీల్దార్‌ సాంబశివుడు, తదితరులు సందర్శించారు. ఘటన వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా మహాదేవ ఇండస్ట్రీస్‌ సీఎంఆర్‌ కింద 94 ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 8 ఏసీకేలు అందించినట్లు అధికారులు తెలిపారు. కాగా, మిల్లు యజమాని నీలం సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

నకిలీ గురుస్వామికి దేహశుద్ధి

తొర్రూరు: డివిజన్‌ కేంద్రంలోని బస్టాండ్‌ సమీపంలో ఓ నకిలీ గురుస్వామికి మహిళలు దేహశుద్ధి చేశారు. ఎస్సై రాంజీనాయక్‌ కథనం ప్రకారం తొర్రూరు ప్రాంతానికి చెందిన ఈదురుకట్ల యాకయ్య (అలియాస్‌ శ్రీను) అనే నకిలీ గురుస్వామికి హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌కు చెందిన పాలడుగు శ్రీదేవితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సదురు మహిళ అనారోగ్యం బారిన పడింది. దీంతో తాను బాగు చేస్తానని నమ్మించి పలుమార్లు సుమారు రూ. 4 లక్షలు వసూలు చేశాడు. అంతేకాకుండా రెండు రోజులుగా బాధిత మహిళకు ఫోన్‌ చేస్తూ వెంటనే డబ్బు తీసుకుని తొర్రూరుకు రావాలని, లేకుంటే నగ్నంగా తన వద్దనున్న ఫొటోలు, వీడియో బయట పెడుతానాని బెదిరించాడు. దీంతో బాధిత మహిళ శనివారం సాయంత్రం కొందరు మహిళలతో తొర్రూరుకు వచ్చి గురుస్వామిగా చలామణి అవుతున్న యాకయ్యను బస్టాండ్‌ వద్ద చితకబాది పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం యాకయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



నకిలీ గురుస్వామికి దేహశుద్ధి చేస్తున్న మహిళలు